andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.3। కనిష్ఠం 25.8



నిర్మల్
జిల్లా వార్తలు

సోమవారం 24 జూన్ 2024

పోలీసు సేవా పథకాలకు ప్రతిభావంతుల ఎంపిక

నిర్మల్ కల్చరల్, జూన్ 23: జిల్లా నుంచి పోలీసు సేవా పథకాలకు ఎంపికైన ప్రతిభావంతులను ఎస్పీ జానకి షర్మిల అభినందించారు. పోలీసుశాఖలో విశిష్టమైన సేవలందించినందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పథకాలు అందిస్తుందని ఎస్పీ తెలిపారు. విధి నిర్వహణలో కష్టపడి పని చేసే ఆరికి తగిన గుర్తింపు లభిస్తుందని ఎస్పీ అన్నారు. భైంసా టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై గౌస్, కడెం ఏఎస్సై దేవు, ఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏఆర్ఎస్సై గుణవంత్, ముథోల్ పీఎస్ హెచ్‌సీ ఉత్తమ్ ఈ అవార్డులకు ఎంపికైనట్లు తెలిపారు.



• ఆకాశంలో కారు మబ్బులు

• పత్తి పంట వేసేందుకు పెంబిలో వ్యవసాయ భూమిని ట్రాక్టర్‌తో సిద్ధం చేస్తున్న రైతు



• కడెంలో పసుపు, మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న రైతులు

కరుణించిన వరుణుడు!

- నిరాశపర్చిన మృగశిర కార్తె
- ఆరుద్ర కార్తె ఆగమనంతోనే జిల్లాలో కరుస్తున్న వర్షాలు
- వానాకాలం సాగుపై చిగురిస్తున్న అన్నదాత ఆశలు
- జిల్లావ్యాప్తంగా 4లక్షల పైగా ఎకరాలలో సాగుకు సన్నద్ధం
- జిల్లాలో శనివారం 42 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- ఊపందుకోనున్న వ్యవసాయ పనులు

ఖానాపూర్, జూన్ 23: వరుణుడు కరుణించాడు. నిరాశలో ఉన్న రైతన్నకు ఆరుద్ర కార్తె వస్తూ వస్తూనే చల్లని కబురును తీసుకొచ్చింది. ఆరుద్ర కార్తె శనివారం ఆరంభమైన నేపథ్యంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. దీంతో వానాకాలం సాగుపై అన్నదాతలో ఆశలు చిగురించినట్లయ్యింది. గడ్డెన్న వాగు, స్వర్ణ, కడెం ప్రాజెక్టులతోపాటు ఖానాపూర్, కడెం మండలాల్లోని సుమారు 15వేలకు పైగా ఎకరాలకు నీరందించే సదర్మాట్ ఆనకట్టలోకి క్రమేపీ వర్షపు నీరు చేరుతోంది. దీంతో ప్రస్తుతం జిల్లాలోని రైతాంగం వ్యవసాయ పనులలో నిమగ్నమైంది. పత్తి, పసుపు, సోయా, మొక్కజొన్న, పెసరు, కంది తదితర పంటలన్నీ కలిసి సుమారు 4లక్షల ఎకరాలకు పైగా సాగుతు జరుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఆరంభంలో ఆందోళన కలిగించిన వర్షాలు

ఈ ఏడాది వర్షాకాలం ఆరంభంలో మృగశిర కార్తెలో వర్షాలు కురవలేదు. దీంతో విత్తనాలు వేయడం ఆలస్యమైంది. అధికారులు సైతం జిల్లాలో లోటు వర్షపాతం ఉండడంతో రైతులు పంటలు వేసుకోవద్దని, పెద్ద వర్షం కురిస్తేనే వేసుకోవాలనే సూచనలు చేశారు. మృగశిర కార్తె మొత్తం వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో ఒక దశలో వాతావరణం ఎండాకాలాన్ని తలపించింది. దీంతో ఎక్కడికక్కడ రైతన్నలు వ్యవసాయ పనులను ప్రారంభించక వరుణుడి రాక కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి తలెత్తింది. వర్షాలు లేక ఆందోళన చెందుతున్న అన్నదాతకు ఆరుద్ర కార్తె ఆశలు రేకెత్తించింది. జిల్లా వ్యాప్తంగా ఒక్కసారిగా వాతావరణం చల్లబడి గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వానాకాలం పంటపై అన్నదాత ఆశలు చిగురించాయి.

జిల్లాలో 4.33 లక్షల ఎకరాలలో సాగు..

ఎట్టకేలకు వర్షాలు కురవడంతో రైతన్న ఇక వానాకాలం పంటను సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈఏడాది 4,33,300 ఎకరాలలో ఆయా రకాల పంటలు సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా లక్షా 68వేల ఎకరాలలో పత్తి, లక్షా 35వేల ఎకరాలలో వరి, లక్ష ఎకరాలలో సోయాబీన్, 18వేల ఎకరాలలో మొక్కజొన్న, పది వేల ఎకరాలలో కంది, వెయ్యి ఎకరాలలో ఇతర పంటలను సాగు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను ఇప్పటికే అందుబాటులో ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు. ఇదివరకే వేసవి దుక్కులను దున్నిసిద్ధంగా ఉంచిన రైతన్నకు ఈ వర్షంతో విత్తనాలను సమృద్ధిగా నాటుకునే వెసులుబాటు కలిసి వచ్చిందని అధికారులు చెబుతున్నారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు

జిల్లాలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇదివరకే దక్కులు దున్ని సిద్ధంగా ఉంచుకున్న రైతులు పత్తి, పసుపు, మొక్కజొన్న లాంటి విత్తనాలను నాటే పనిలో తలమునకలయ్యారు. వరి పంటను సాగు చేసేందుకు రైతులు ఇదివరకే నారుమడులను సిద్ధం చేసుకున్నారు. వరినార్లు పోసుకునేందుకు బురద మడులను తయారుచేసి వరినార్లు అలుకుతున్నారు. వరిపంట కోసం దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచిన వ్యవసాయ భూముల్లో పచ్చిరొట్ట ఎరువుల కోసం జీలుగ, జనుము, పెసరు లాంటి విత్తనాలను చల్లి బురద మడులను సిద్ధం చేసే నాటికి వాటిని ఏపుగా పెంచేలా రైతులు సన్నద్ధమవుతున్నారు. ఏపుగా పెరిగిన జనుము, జీలుగ, పెసరు పంటలను బురద మడులలో కేజీవీల్స్‌తో తొక్కించి పచ్చిరొట్ట ఎరువులను తయారుచేసి పంటకు అదనపు బలాన్ని ఇచ్చేలా వ్యవసాయ భూములను సిద్ధం చేస్తున్నారు. దీంతో తాజాగా జిల్లాలో కురిసిన వర్షాలు అన్నదాతలకు వర్షాకాలం పంటపై ఆశలు రేపి వ్యవసాయ పనుల్లో తలమునకను కలిగించేశాయి. దీంతో ప్రస్తుతం పల్లెల్లో వ్యవసాయ పండగ వాతావరణం నెలకొంది.

42 మి.మీ. సగటు వర్షపాతం నమోదు

గత 15రోజులుగా సరైన వర్షాలు లేక వేసవికాలాన్ని తలపించిన జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. దీంతో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం తెల్లవారుజాము వరకు జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. కుబీర్ మండలంలో 62.4 మి.మీ., తానూర్‌లో 22.8 మి.మీ., బాసరలో 9.6 మి.మీ., ముథోల్‌లో 92.2 మి.మీ., భైంసాలో 24.8 మి.మీ., కుంటాలలో 72.4 మి.మీ., నర్సాపూర్ (జి)లో 49.8 మి.మీ., లోకేశ్వరంలో 24 మి.మీ., దిలావర్‌పూర్‌లో 65.2 మి.మీ., సారంగాపూర్‌లో 35.2 మి.మీ., నిర్మల్‌లో 35.2 మి.మీ., నిర్మల్‌రూరల్ మండలంలో 20.2 మి.మీ., సోన్‌లో 34.8 మి.మీ., లక్ష్మణచాందలో 75.4 మి.మీ., మామడలో 18.2 మి.మీ., పెంబిలో 37.8 మి.మీ., ఖానాపూర్‌లో 27.2 మి.మీ., కడెంలో 66.4 మి.మీ., దస్తురాబాద్‌లో 23.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా సగటున 42 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబెతున్నారు. ఆరుద్ర కార్తె ఆరంభంలోనే జిల్లాలో 42 మి.మీ. వర్షపాతం నమోదు కావడంతో అన్నిరకాల పంటల సాగుకు ఈ వాతావరణం అనుకూలమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.



సదర్మాట్ (ఫైల్)



ఆలయ నిర్మాణం పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి అల్లోల

అడెల్లి పోచమ్మ ఆలయంలో మాజీ మంత్రి పూజలు

సారంగాపూర్, జూన్23: మండలంలో గల అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో ఆదివారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నేపథ్యంలో ఆలయపూజారి శ్రీనివాస్ అమ్మవారికి హారతినిచ్చి పూజలు చేశారు. అనంతరం ఆయనను ఆలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. దీంతోపాటు నూతనంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణం పనులను పరిశీలించి నిర్మాణం పనుల వివరాలను సదరు కాంట్రాక్టర్ జగన్ మోహన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈయనవెంట నాయకులు నారాయణ రెడ్డి, మాధవ్ రావు, ఉట్ల రాజేశ్వర్, రాజులు ఉన్నారు.

• మొక్కులు మొక్కిన సివిల్ జడ్జి

మండలంలో గల అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో ఆదివారం సీనియర్ సివిల్ జడ్జి గవ్వల రాధిక మొక్కులను మొక్కి పూజలు చేశారు. ఆలయ సిబ్బంది సివిల్ జడ్జి రాధికను శాలువాతో సన్మానించారు.

'విద్యార్థి నాయకుల అరెస్టు అక్రమం'

నిర్మల్ కల్చరల్, జూన్23: నీట్ పరీక్షా పత్రం లీకేజీపై కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా విద్యార్థి నాయకులను అరెస్టు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ ఖండించింది. ఆదివారం నాయకులు మాట్లాడుతూ కరీంనగర్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటిముట్టడి సందర్భంగా లాఠీఛార్జ్ చేసి రజనీకాంత్, అరవింద్, ప్రశాంత్ తదితరులను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. బేషరతుగా వారిని వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు. లీకేజీకి బాధ్యులైన వారిపై చర్య తీసుకోవాలని విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ఎన్టీఏను రద్దుచేయాలన్నారు. లేనిచో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి జిద్దా ఉర్దూ అకాడమీ పురస్కారం

నిర్మల్ కల్చరల్, జూన్ 23: నిర్మల్ పట్టణం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మొహమ్మద్ ఇంతియాజ్ సౌదీ అరేబియాలోని జిద్దా ఉర్దూ అకాడమీ ఉత్తమ ఉపాధ్యాయ ప్రతిష్ఠాత్మక పురస్కారం 2024 అందుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శాలువాతో సన్మానించి పురస్కారం అందించారు.

ఘనంగా ధర్మారం పోచమ్మ పండుగ

లక్ష్మణచాంద, జూన్23: మండలంలోని ధర్మారం గ్రామంలో గల 'ధర్మారం పోచమ్మ'గా ప్రసిద్ధికెక్కిన ఆలయంలో ఆయాగ్రామాల ప్రజలు పోచమ్మ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలతోపాటు సమీప మండలాలు, సమీప జిల్లాల నుంచి తరలి వచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. తీపి నైవేద్యంతోపాటు మాంసాహార (ఎండు చేపల కూర) నైవేద్యం సమర్పించి తమ ఉపవాస దీక్షను విరమించారు. ఇంటిల్లిపాదిని క్షేమంగా చూడాలని వేడుకున్నారు.



భక్తులతో సందడిగా ధర్మారం పోచమ్మ ఆలయం

ఖరీఫ్ పనుల్లో రైతులు బిజీబిజీ



• భైంసా శివారులో విత్తనాలు విత్తడానికి వ్యవసాయ భూమిని సిద్ధం చేస్తున్న రైతు



• భైంసా శివారులో పత్తి విత్తనాలు విత్తుతున్న వ్యవసాయ కూలీలు

భైంసా, జూన్ 23: డివిజన్ పరిధిలో ఖరీఫ్ పనులు ఊపందుకుంటున్నాయి. మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులను వేగిరం చేశారు. పంటల సాగుకు అనుకూలమైన వాతావరణం ఏర్పడిన నేపథ్యంలో వ్యవసాయ భూములలో విత్తనాలు విత్తేందుకు అవసరమైన చర్యలను పూర్తి చేసుకున్నారు. ఈ క్రమంలో ఇక్కడి రైతాంగం ఆదివారం నుంచి విత్తనాలు విత్తే పనులను ముమ్మరం చేశారు. వ్యవసాయ క్షేత్రాలన్నీ విత్తనాలు విత్తే వ్యవసాయదారులు, కూలీలు, విత్తనాలు విత్తేందుకు సిద్ధం చేస్తున్న రైతులతో సందడిగా కనిపిస్తున్నాయి. పనులు జోరందుకోవడంతో పల్లె ప్రాంతాల్లో కూలీల కొరత ఏర్పడింది.

రైతు రుణమాఫీపై కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

• కాంగ్రెస్ రైతు ప్రభుత్వం: డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు • రైతు రుణమాఫీ ప్రకటించిన రాహుల్, సీఎం రేవంత్‌కు పాలాభిషేకం

నిర్మల్ కల్చరల్, జూన్23: సీఎం రేవంత్ రెడ్డి రైతు రుణమాఫీ ప్రకటించిన సందర్భంగా ఆదివారం నిర్మల్‌లోని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు నివాసంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు మాట్లాడుతూ రైతు రుణమాఫీ కాంగ్రెస్‌తోనే సాధ్యమని మరోసారి రుజువైందని అన్నారు. 2022లో వరంగల్‌లో ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు రుణమాఫీ ప్రకటించిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. రుణమాఫీ ప్రకటన రైతుల్లో ఆనందం నింపుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఎస్.సుదర్శన్, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్, నాయకులు ఎర్రవోతు రాజే ందర్, కే. వేణుగోపాల్, భీంరెడ్డి, రాంరెడ్డి, విలాస్, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎన్నికల హామీని సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని, ఆగస్టులో రుణమాఫీ చేస్తానని ప్రకటించారని నాయకులు పేర్కొన్నారు. సందర్భంగా సీఎం చిత్రపటానికి ఈ పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు బి. నర్సయ్య, శ్రీనివాస్ రెడ్డి, నారాయణ రెడ్డి, విలాస్, ఆదిలతో పాటు నాయకులు ఉన్నారు.



పాలాభిషేకం చేస్తున్న శ్రీహరిరావు

నర్సాపూర్(జి): తెలంగాణ రైతులకు ఏక కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేస్తుండటంపై మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తంచేస్తూ ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాతీ ఆవరణలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు పరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు బర్ల దయానంద్, గుండోజి రవి, కోంద్ర రేఖారమేష్, అజీమ్, గాదెసంతోష్, గజ్జారాం, నర్సారెడ్డి, శ్యాంరెడ్డి, గుండోజీరాము, సమద్, ముక్రమ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: ఒకే దఫాలో రూ.2లక్షల రుణమాఫీ అమలును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు చిత్రపటాలకు మండల కేంద్రంలో ఆదివారం పాలాభిషేకం చేశారు. ఒకే దఫాలో మాఫీ చేయటంపై ఆనందం వ్యక్తం చేస్తూ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, నాయకులు కేశం రమేష్, ఈటెల శ్రీనివాస్, గురాల లింగారెడ్డి, చింతకింది శేఖర్ రెడ్డి, రాజారెడ్డి, మూగ ముత్యం, తలారి రాములు, నరేష్ ఉన్నారు.

దిలావర్‌పూర్: రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయబోతున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులు ఆదివారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలో రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాజారెడ్డి, యూసుఫ్, అనిల్, రమణ, రాజు, దయాకర్, నవీన్, విజయ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సలీం, పరుశురాం, వైస్ ఎంపీపీ బాపురావు, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.



నర్సాపూర్(జి)లో.. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



దిలావర్‌పూర్‌లో..



సారంపూర్ మండలంలో..

బాసర ఆర్జీయూకేటీకి 15వేల దరఖాస్తులు

• ప్రతీ ఏడాది తగ్గిపోతున్న దరఖాస్తులు

బాసర, జూన్23: బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీకి 2024-25 విద్యాసంవత్సరం ప్రవేశంకోసం సుమారు 15వేల దరఖాస్తులు వచ్చినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ఈనెల చివరివరకు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తిచేసి జూలై 3వ తేదిన ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. జూలై2వ వారంలో అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు చెప్పారు. అయితే ట్రిపుల్‌ఐటీకి గతేడాది నుంచి దరఖాస్తుల సంఖ్య భారీగా తగ్గుతూ వస్తోంది. 30వేలకు పైగా వచ్చే దరఖాస్తులు సరిగ్గా సగం కూడా రావడంలేదు. యూనివర్సిటీలో సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడం, గత ఏడాది ఒక విద్యాసంవత్సరంలో ఎనిమిది మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం వంటి ఘటనలు చేసుకోవడం ఇలాంటి లోపాల కారణంగానే ప్రవేశం పొందే దరఖాస్తులు తగ్గిపోవడానికి గల కారణాలుగా చెప్పుకుంటున్నారు.

ధరణిలో భూ రికార్డులు తారుమారు

• బాధితుల ఆవేదన

బాసర, జూన్23: ధరణి పోర్టల్‌లో భూరికార్డులను తారుమారు చేసి తమ భూమిని కాజేసే ప్రయత్నం చేస్తున్నారని బాసరలో భూబాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాసరకు చెందిన షేక్ ఉమేర్, షేక్ అబ్బేర్ అనే బాధితులు మాట్లాడుతూ తమ కుటుంబ పెద్దల నుంచి వచ్చిన భూములను కొందరు అక్రమార్కులు అధికారులతో చేతులు కలిపి రికార్డులు మార్చేశారని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రోహిబిటెడ్ ప్రాపర్టీ లిస్టులో తమ పట్టాభూమిని చేర్చి వివాదాస్పద భూమిగా మార్చి కొందరు నాయకులు తమభూమిని లాక్కొనే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. వివిధ సర్వే నెంబర్లలో గల దాదాపు 40 ఎకరాలకు పైగా భూమిని ధరణిలో రికార్డులను మార్చి మాయం చేసే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. కుటుంబ పెద్దల నుంచి వచ్చిన తమ భూములను నాయకుల కబ్జా నుంచి కాపాడాలని వేడుకుంటున్నారు.

మరమ్మతులపై నిర్లక్ష్యం!

కుబీర్, జూన్ 23: గతేడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు వరద రహదారులపై నుంచి ప్రవహించడంతో పలుచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. నేటికి అధికారులు మరమ్మత్తులు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. మండలంలోని బెల్గాం, బెల్గాం తండాల నుంచి మహారాష్ట్రకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో వరదకు ఇలా రహదారి ధ్వంసమై ప్రమాదకరంగా ఉంది.




ప్రమాదకరంగా ఉన్న రహదారి











భారీగా నిషేధిత గుట్కా పట్టివేత

● రూ.77,60,586 లక్షల గుట్కా నిల్వలు స్వాధీనం

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 23: రాష్ట్రంలో నిషేదిత గుట్కాను బ్యాన్ చేయడంతో జిల్లాలో పక్క సమాచారంతో పట్టణంలోని 5 గోడౌన్స్‌లో జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. శనివారం అర్ధరాత్రి స్థానిక ఓంకార్ జిన్నింగ్ మిల్ నాలుగు గోడౌన్‌లలో,చాందా వద్ద ఒక గోడౌన్‌లో రూ.77,60,586 లక్షల విలువ చేసే నిషేదిత గుట్కా లభించిందని తెలిపారు. జిల్లా ఎస్పీ, డీఎస్పీ, సీసీఎస్ సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది కలిసి ఈ దాడులు నిర్వహించడం జరిగిందన్నారు.దాడుల్లో భాగంగా ఆదిలాబాద్ వన్‌టౌన్‌లోని ఓంకార్ జిన్నింగ్ నందు గల నాలుగు గోడౌన్స్‌లో రూ.50,16,942 విలువ చేసే దాదాపు 20 రకాల నిషేదిత గుట్కా లభించిందని, నలుగురి పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఆదిలాబాద్‌రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో రూ.27,43,644 విలువ చేసే నిషేదిత గుట్కా లభించిందని, నలుగురి పై కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.స్వాధీనం చేసుకున్న నిషేదిత గుట్కా విలువ రూ.77,60,586 లక్షలు నిషేదిత గుట్కాను సీజ్ చేయడం జరిగిందన్నారు. కాగా నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేయడం జరిగిందని, మిగిలిన ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కాగా నిందితులు సాజిదుల్లాఖాన్ తండ్రి అజ్మతుల్లాఖాన్ ఆదిలాబాద్, అస్లాంఖాన్ తండ్రి అజ్మతుల్లాఖాన్ ఆదిలాబాద్ (పరారీ), సమీఉల్లాఖాన్ తండ్రి అజ్మతుల్లాఖాన్ ఆదిలాబాద్(పరారీ), పసివుల్లాఖాన్ తండ్రి అజ్మతుల్లాఖాన్ ఆదిలాబాద్,


స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లు

అర్బాజ్‌ఆలీ (పరారీ) ఉన్నారన్నారు. కాగా నలుగురి పై ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో, ఐదుగురిపై ఆదిలాబాద్‌రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గుట్కా వినియోగం వల్ల ప్రజలకు తీవ్ర అనారోగ్యం, దీర్ఘకాలిక రోగాల భారీన పడడం, ప్రమాదకరంగా ఉండడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం వీటిని నిషేదించడం జరిగిందని తెలిపారు. నిషేదిత గుట్కాను అమ్మినా, రవాణా చేసిన వారి పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో గుట్కాను మనూలంగా రూపుమాపాలనే ఉద్దేశంతో ప్రత్యేక సిబ్బందిని నియమిస్తూ నిఘా వ్యవస్థను పటిష్ఠం చేస్తూ విధులను నిర్వర్తించడం జరుగుతుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా గుట్కా విక్రయదారులు నిషేదిత గుట్కాను విక్రయించడం మానుకోవాలని సూచించారు. ఈ దాడుల్లో జిల్లా ఎస్పీతో పాటు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఐలు కె.సత్యనారాయణ, ఎ.అశోక్, ఎ.రమాకాంత్,సీసీఎస్ సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకూ అనిల్ అన్న అడుగు


ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

సిరికొండ, జూన్ 23: మండలంలో ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వాడ వాడలా తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'గడప గడపకు అనిల్ అన్న అడుగు' కార్యక్రమంలో భాగంగా సిరికొండ మండలంలో ఆయన స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో డ్రైనేజీలు లేకపోవడంతో వరదనీరు ఇళ్ళల్లోకి వచ్చి చేరతుందని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే తమ సమస్యలను పరిష్కరిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల సిరికొండ మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ సూర్యవంశీ రాజేశ్వర్ ఉత్తర్‌ప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తిరుగుప్రయాణంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఒరగంటి పెంటన్న, గొర్ల రాజన్న, ఎక్బాల్, బియ్యాల మల్లేష్, కదం సూర్యకాంత్, నర్సయ్య, రోహిదాస్, ఎల్పుల మల్లేష్, లతీఫ్, ఆవుల లక్ష్మణ్, సూర్యవంశీ మారుతి, రాజేందర్, రాజేష్, విజయ్, కేజీబీవీ పాఠశాల ఎస్వో సంధ్యారాణి, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఇచ్చోడ: మండలంలోని ముక్రా(కె) గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి చెందిన కాంబ్లె ఆర్తీక ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారి స్వగృహానాకి వెళ్లి వారి కుటుంబసభ్యులన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి, ఎంపీటీసీ నాయకులు మహెందర్‌రెడ్డి, దేవెందర్‌రెడ్డి, గులాబ్, కరణ్, తదితరులు పాల్గొన్నారు.




బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



'సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి'


ఆదిలాబాద్ అర్బన్, జూన్ 23: దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం నూతన కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు నగేష్ అన్నారు. ఆదివారం సుందరయ్య భవనంలో వేదిక జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పై చర్చించారు. వచ్చే నెలలో నిర్వహించే జిల్లా మహాసభల విజయవంతం పై పలు తీర్మానాలు చేశారు.ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ గతప్రభుత్వాలు దివ్యాంగుల సమస్యల పై నిర్లక్ష్యం చేశాయ న్నారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగుల హక్కులు, చట్టాల పరిరక్షణతో పాటు సమస్యలను పరిష్కరించాలని కోరారు . ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, వంద శాతం రాయితీతో రుణాలు, ఇందిరమ్మ ఇళ్లలో ఐదు శాతం, 35 కిలోల బియ్యం కోసం అంత్యోదయ కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ కార్యదర్శి అరిఫా, సభ్యులు పొచ్చన్న, అనసూయ, ప్రేమల, యోగేశ్, పొచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గేదె మృతి

నేరడిగొండ, జూన్ 23: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఒక గేదె విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది.ఆదివారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన చిన్నకారు రైతు జాదవ్ జవహర్‌లాల్ రోజువారీగా ఆదివారం ఉదయం గేదెను మేతకు ఊరు బయటకు వదిలాడు. అటు వైపు ఓ రైతు వ్యవసాయపు విద్యుత్ మోటారు బిగించి ఉంది.వర్షం కారణంగా కరెంట్ మోటారు వైరు ఎర్తింగ్‌తో అక్కడ గేదె మేస్తున్న క్రమంలో విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిందని, ఆ గేదె విలువ సుమారు రూ.50వేలు ఉంటుంది.

విశేష కృషికి పురస్కారం

తాంసి, జూన్ 23: జిల్లాస్థాయిలో ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికైన తాంసి ఎస్ఐ బాధావత్ శివరామ్‌ను బీఆర్ఎస్ నేతలు ఆదివారం ఉదయం సన్మానించారు. ఎన్నికల విధులతో పాటు మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ, పెండింగ్ కేసుల క్లియరెన్స్‌ల విషయంలో ఉత్తమ ప్రతిభ కనబరిచేందుకు గాను జిల్లా పోలీసు శాఖ అధికారులు ఆయనకు ఈ పురస్కారం ఇచ్చినట్లు నేతలు చెబుతున్నారు. ఆదివారం ఉదయం తాంసి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐని, మాజీ సర్పంచ్, తెరాస మాజీ మండల కన్వీనర్ కృష్ణ రత్న ప్రకాష్, కాంగ్రెస్ మాజీ మండల కన్వీనర్ రామన్న యాదవ్, దేవారెడ్డి, తదితరులు సన్మానించారు.



కడెం ప్రాజెక్టు (ఫైల్)

నిర్మల్‌లో విస్తారంగా వర్షాలు

● కడెం ప్రాజెక్టులోకి చేరుతున్న వరద నీరు

ఖానాపూర్, జూన్ 23: జిల్లాలో గత రెండురోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కడెం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 673.200 అడుగులు ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 2.564 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 2970 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని అధికారులు తెలిపారు. కడెం ప్రాజెక్టులోకి క్రమేపి వరద నీరు చేరుతుండడంతో ఆయకట్టు రైతాంగం సంతోషం వ్యక్తం చేస్తోంది. ఖానాపూర్, మంచిర్యాల నియోజకవర్గాలలోని రైతులలో ఈ వానాకాలం పంటపై ఆశలు చిగురిస్తున్నాయి. గత రెండేళ్లుగా కురిసిన భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరి ప్రాజెక్టు డేంజర్ బెల్స్ మోగించడంతో రైతులు గత మూడు పంటలకు దూరంగా ఉన్నారు. ఈ తరుణంలో మరమ్మతులు పూర్తి చేసుకుంటున్న కడెం ప్రాజెక్టులోకి వరద వచ్చి చేరుతుండడం వానాకాలం పంటపై ఆయకట్టు రైతాంగంలో ఆశలు రేకెత్తుతున్నాయి.



వంతనకు పడిన రంధ్రం



చీరతో రంధ్రాన్ని కప్పిన దృశ్యం

ఆదమరిస్తే అంతే..!

● తురాటి చింతాత వంతెనకు భారీ రంధ్రం

నర్సాపూర్(జి), జూన్23: మండలంలోని తురాటి గ్రామ చింతాత మొర్రి (చిన్నతాత వంతెన)నకు భారీ రంధ్రం పడటంతో గ్రామ ప్రజలు వంతెన దాటాలంటే భయపడుతూ ప్రయాణిస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రజలు ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు సమస్య పరిష్కరిచాలని కోరినా ఫలితం లేదని వాపోతున్నారు. అధికారులలు స్పందించి వెంటనే మరమత్తులు చేస్తే సమస్య తీరుతుంది. వానాకాలం వచ్చిందంటే తురాటి గ్రామ చెరువు నుంచి అలుగుపారితే రెండు రోజుల పొడవునా గ్రామానికి రాకపోకలు నిలిచిపోతాయి. గతంలో పాఠశాలకు వెళ్లే విద్యార్దులకు జేసీబీపై ఎక్కించి వంతెన దాటించారు. వర్షాకాలం విద్యార్థులకు, రైతులకు ఇబ్బందులు కలుగకుండా వంతెన మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● పులి రవి, పాల వ్యాపారి, తురాటి గ్రామస్థుడు

నిత్యం పాలు అమ్మడానికి ఉదయం ద్విచక్ర వాహనంపై ఇతర గ్రామాలకు వెళ్లాలంటే వంతెన దాటి వెళ్లాలి. అయితే వంతెపై ఉన్న గుంత ప్రమాదరకంగా ఉంది. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

మారనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల రూపురేఖలు

● పీఎం-ఉషా పథకం కింద రూ.5కోట్లు మంజూరు ● మెరుగుకానున్న వసతులు, సౌకర్యాలు ● సమకూరనున్న ఆధునిక ల్యాబ్‌లు



డిగ్రీ కళాశాల భవనం



డిగ్రీ కళాశాల ప్రవేశ మార్గం

భైంసా,జూన్23: సమస్యల వలయంలో కొనసాగుతున్న భైంసా పట్టణ గోపాల్‌రావ్ పటేల్ ప్రభుత్వ డిగ్రీకళాశాల రూపు రేఖలు మారనున్నాయి. వసతుల లేమి, సౌకర్యాల కరువుతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు తొలగిపోనున్నాయి. అవస్థలు దూరం కానున్నాయి. కళాశాలకు ప్రధాన మంత్రి ఉచ్చతర శిక్ష అభియాన్ పథకం కింద రూ.5కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు సంబంధిత విషయంలో కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ అండ్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.వెంకటేషమ్ ఉత్తర్వులు జారీచేశారు. సంబంధిత నిధుల ద్వారా కళాశాలలో విద్యార్థులకు అధునిక వసతుల కల్పన, సౌకర్యాల మెరుగుదల కానున్నాయి. అదనపు నిర్మాణాలు, భవన మరమ్మతులు జరుగనున్నాయి. తద్వారా కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ తొలగిపోనున్నాయి.

● కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వాటా

పీఎ- ఉషా పథకం కింద భైంసాలోని గోపాల్‌రావ్ పటేల్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాలతోపాటు రాష్ట్రంలోని మరో 12 డిగ్రీ కళాశాలలకు రూ.5 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 వాటా ఉంది. భైంసా కళాశాలకు మంజూరైన రూ.5కోట్ల నిధుల్లో రూ.3.97 కోట్లు నిర్మాణాలు, మరమ్మతులకు కేటాయించనున్నారు. మిగతా 1.03 కోట్లతో స్టేషనరీ, ఫర్నీచర్‌తోపాటు ఇతర వసతులు, సౌకర్యాలు కల్పించనున్నారు.

● అధునిక కంప్యూటర్ ల్యాబ్

పీఎం ఉషా పథకం కింద కళాశాల విద్యార్థులకు అధునిక కంప్యూటర్ ల్యాబ్ సమకూరనుంది. రూ.25.84 లక్షల వ్యయంతో 65 ఇంచుల 18 ఇంటరాక్టివ్ ఆన్‌డ్రాయిడ్ టచ్ ప్యానల్స్, కంప్యూటర్లు, ల్యాప్ ట్యాపులు, డిజిటల్ డూప్లికేటర్ 130 పీపీఎం, డిజిటల్ పోడియమ్, ప్రొజెక్టర్స్, గ్రీడ్ బోర్డ్స్, 10 కేవీఏ యూపీఎస్, 12వి120 ఏహెచ్ బ్యాటరీలు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు చదువుకునేందుకు, ల్యాబ్‌ల్లో పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా కూర్చీలు, టెబుళ్లు సమకూరనున్నాయి. కార్పోరేట్ కళాశాలల తరహ వసతులు, సౌకర్యాలు కలుగనున్నాయి.

● ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల హర్షం

పట్టణంలోని గోపాల్‌రావ్ పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పీఎంఉషా పథకం కింద రూ.5కోట్ల నిధుల మంజూరు విషయాన్ని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్‌లు వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించి హర్షం వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విద్యాభివృద్ధికి ఇతోదికంగా నిధుల మంజూరు చేస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు మార్గం సుగమం చేస్తున్నారని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పెర్కొన్నారు. ఇక నిధులు కేటాయించిన ప్రభుత్వానికి మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ కృతజ్ఞతలు తెలిపారు.

నిర్మల్ జిల్లా ప్రభుత్వ సుపత్రిలో..

రోజంతా నిలిచిన విద్యుత్

● ఉదయం నుంచి రాత్రి వరకు రాని కరెంట్ ● రాత్రివేళ టార్చ్‌లైట్ల వెలుగులో రోగులకు వైద్యసేవలు

● ఎట్టకేలకు సమస్యను పునరుద్ధరించిన అధికారులు

నిర్మల్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోజంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆసుప్రతి ఆవర ణలోని చెత్తను సిబ్బంది కాల్చే క్రమంలో మంటలు విద్యుత్ తీగలకు అంటుకోగా సమస్య ఉత్పన్నమైంది. ఆ వెంటనే ఆసుప్రతిలోని విద్యుత్ పీజ్‌లు ఎగిరిపోవడం వంటి సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఆదివారం ఉదయం నుంచి రాత్రివరకు ఆసుపత్రిలో విద్యుత్ సరఫరా అంతరాయం కలిగింది. సాయంత్రం నుంచి రాత్రి 9గంటల వరకు కూడా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆసుపత్రి అంధకారంలోనే ఉండిపో యింది. దీంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు టార్చ్‌లైట్ల వెలుగులోనే వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితి ఏర్పంది. ఆసుపత్రిలో విద్యుత్ సరఫరా లేక ఇటు సిబ్బంది, అటు రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ఎట్టకేలకే రాత్రి 10గంటల తర్వాత అధికారులు విద్యుత్ సమస్యలను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఏంటని అధికారుల తీరుపై పలువురు ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు.



టార్చ్‌లైట్ వేసి విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న నాయకులు

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘననివాళి

నిర్మల్ కల్చరల్, జూన్23: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆదివారం సోన్ మండల బీజేపీ నాయకులు ఆయనకు ఘన నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన త్యాగాలు స్మరించుకున్నారు. నాయకులు మాట్లాడుతూ... దేశంలో తొలి హిందూవాద రాజకీయ పార్టీని (ప్రస్తుత బీజేపీ) స్థాపించిన నేతగా నిలిచారన్నారు. విలువలతో జాతీయ వాదాన్ని హిందుత్వాన్ని ముఖర్జీ ప్రగాఢంగా విశ్వసించి ప్రజలకు అండగా నిలబడ్డాడని అన్నారు. గొప్ప జాతీయ హిందుత్వ వాదని కొనియాడారు. ఎంపీపీ మానస హరీష్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మేకల అశోక్, మార గంగారెడ్డి, నరేష్, నర్సయ్య, డి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● మహోన్నత దేశభక్తుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ



భైంసాలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామరావ్ తదితరులు

భైంసా: స్వతంత్ర భారత రాజనీతిజ్ఞులలో అగ్రగణ్యుడైన జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ మహోన్నత దేశభక్తుడని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, బీజేపీ ముథోల్ నియోజకవర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బలిదాన్ దివాస్ పేరిట నిర్వహించిన శ్యామాప్రసాద్‌ముఖర్జీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. శ్యామాప్రసాద్ 33ఏళ్లలోనే అసాధారణస్థాయిలో రెండు పర్యాయాలు కలకత్తా విశ్వవిద్యాలయానికి వైస్‌చాన్సిలర్‌గా బాధ్యతలు నిర్వహించిన మేధావని కొనియాడారు. యువకుల్లో దేశభక్తిని నింపేందుకు పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్ర మంలో భైంసా మున్సిపల్ కౌన్సిలర్లు గౌతం పింగ్లే, దశరథ్, పార్టీ రాష్ట్ర ప్రతినిధి బాజీరావ్ పాటిల్, జిల్లా ప్రతినిధులు గాలి రవి, సాంప్లీ రమేష్, తూమోల్ల దత్తు, రావుల పోశెట్టి గాలి రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరు ప్రొసీడింగ్ కాపీ అందజేత

కుంటాల, జూన్ 23: మండలంలోని ఓలాలో వాల్మీకి బోయ సంఘ భవన నిర్మాణం కోసం రూ.2.50లక్షల మంజూరు పత్రాన్ని సంఘ పెద్దల కు, మాజీ సర్పంచ్ ఖనీష్ ఫాతిమా, హైమద్ పాషా, మాజీ ఎంపీటీసీ శ్రీ నివాస్ గౌడ్‌లకు జడ్పీటీసీ గంగామణి బుచ్చన్న అందజేశారు.



ఆదిలాబాద్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్



ఉట్నూర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



సిరికొండలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



నేరడిగొండలో నివాళులర్పిస్తున్న నాయకులు

శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి

● ఎమ్మెల్యే పాయల శంకర్ ● ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా ముఖర్జీ వర్ధంతి, బలిదాన్ దివాస్ ● నాయకులు ఘన నివాళి

ఆదిలాబాద్ రూరల్, జూన్ 23: జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బలిదాన దివస్ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్‌తో కలిసి ఎమ్మెల్యే ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖర్జీ సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. ఆర్టికల్ 370 రద్దుతో ముఖర్జీ ఆశయం నెరవేరిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉట్నూర్: దేశం కోసం శ్యామాప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం మరిచిపోలేనిదని బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్‌రితేష్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలో బీజేపీ సంఘ్ వ్యవస్థాపకులు, మహనీయులు శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రితేష్‌రాథోడ్ మాట్లాడుతూ ఏక్‌దేశ్ మే దోవిధాన్, దోప్రధాన్ ఔర్‌దో నిషాన్ నహీ చాలెంటే అనే నినాదంతో జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ దేశం కోసం ప్రాణాలర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, మండల అధ్యక్షులు కోలిపాక రాజశేఖర్, బింగి వెంకటేశ్, సల్లర్ రవీందర్, సాడిగే రాజేశ్వర్, గాలిశ్రీకాంత్, తన్నీరు సతీష్, విజయ్, ఉస్కేమొల్ల దేవిదాస్, శేషారావు, టేకం హరిప్రసాద్, సంపంగం రెడ్డి, సానాగోపి, కలేరిగంగాధర్, విఠల్, వెండి లింగన్న, బూత్ అధ్యక్షులు బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: స్వతంత్ర భారత రాజనీతిజ్ఞులలో అగ్రగణ్యుడు, గొప్ప విద్యావేత్త, మహోన్నత దేశభక్తుడు ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానమంత్రులు, రెండు జాతీయ పతాకాలు ఉండడాన్ని సహించలేమని నినదించిన డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నేరడిగొండ మండల కేంద్రంలో గల భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లె సంతోష్‌సింగ్ మాట్లాడుతూ ఏక్‌దేశ్‌మే దో విధాన్, దో ప్రధాన్, దోనిషాన్ నహీ చలేంగే అని, దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా సమర్పించిన ఆ మహనీయుడికి శతకోటి వందనాలు అర్పిస్తూ ఆయన వర్ధంతిని బలిదాన్ దివాస్‌గా నిర్వహించడం జరిగిందన్నారు. దేశం కోసం శ్యామాప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం మరిచి పోలేనిదని అన్నారు. ఆయన కన్న కలను భారత దేశ ప్రధాని శ్రీ నరేంద్రమోదీ ఆర్టికల్ 370ను రద్దు చేసి సాకంర చేశారని, కాశ్మీర్‌లోని లాల్‌చౌక్‌లో త్రివర్ణ పతాకం రెపరెపలాడుతుందంటే అది ఆనాడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి చేసిన పోరాటమని అన్నారు. ఇందులో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు బంటు ప్రవీణ్, దర్మపురిరాఘవులు, నాయకులు భీంరావ్, దేవ్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ(బలి దాన్ దివస్) వర్ధంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం మండలంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రాణాలర్పించిన మహోన్నతమైన వ్యక్తి అని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బోయిన్‌వాడ్ అమోల్, గోర్బండ్ బాలాజీ, పెంట గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పెన్‌గంగాలో కూరవాసుల ప్రత్యేక పూజలు

జైనథ్, జూన్ 23: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలతో పాటు ప్రజలు పాడిపంటలు సుఖసంతోషాలతో ఉండాలని మండలంలోని కూర గ్రామస్థులు వేడుకున్నారు. ఈ సందర్భంగా కూర గ్రామప్రజలు మహిళలు డప్పులు భజాల మధ్య మండల సరిహద్దున గల పెన్‌గంగా నది దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహిం చి గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు సంవృద్ధిగా పండలని వేడుకున్నారు. అనంతరం గ్రామంలోని బీమన్న దేవుడికి నైవేద్యం సమర్పించి ప్రజలు పాడి పంటలతో సంవృద్ధిగా ఉండాలని మేకలు, కోళ్లను బలిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కూర గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.







1, 2) పెన్‌గంగా నదికి పూజలు నిర్వహిస్తున్న కూర గ్రామస్థులు 2)పెన్‌గంగలో పుణ్యస్నానం చేస్తున్న ప్రజలు

కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది

● కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ




కరంజి(టి)లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఉట్నూర్, జూన్ 23: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలోనే రూ.రెండు లక్షల రుణమాఫీ కార్యరూపం దాలుస్తుండడం అన్నదాత ముఖాల్లో ఆనందం నింపుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆత్రంసుగుణ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గం సమావేశం అనంతరం చేసిన ప్రకటనపై సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుందన్నారు. ఆదివారం ఉట్నూర్ మండలం తేజాపూర్ గ్రామంలో రుణమాఫీపై సంతోషం వ్యక్తం చేస్తూ ఆదివాసీగిరిజన రైతులతో కలిసి పంట చేనులో సంబరాలు, రైతుల వ్యవసాయ పొలంలో విత్తనాలు విత్తి, స్వీట్లు తినిపించి ఆనందం వ్యక్తం చేశారు. ఇది నిజంగానే యావత్ తెలంగాణ రైతులకు మంచి శుభ వార్త అని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను ఎప్పుడు తప్పదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఆనాడు వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించిన విధంగా రైతు రుణమాఫీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి చూపిస్తుందన్నారు. ఆరు గ్యారంటీల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొటిగా నేరవేరుస్తూ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిజం చేసి చూపసిస్తుందని, వారికి భరోసా ఇస్తుందన్నారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుటుందనే ఉద్దేశంతోనే ఇటువంటి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. జిల్లా రైతాంగం తరపున సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తేజాపూర్ గ్రామపటేల్ గోవింద్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కనకసుదర్శన్, కాంబ్లె విశాల్, రాథోడ్‌శ్రీకాంత్, మార్లవాయి మాజీ సర్పంచ్ ప్రతిభ, ఆదివాసీ రైతులున్నారు.

భీంపూర్: రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ భీంపూర్ మండలంలోని కరంజి (టి)లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కుడిమేల దేవారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, రైతులతో కలిసి ఆదివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచారు. ఈకార్యక్రమంలో నాయకులు ఏనుగు దేవారెడ్డి, అశోక్‌రెడ్డి, గురు నారాయణ, గురు విఠల్, పాటిల్, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గుడిహత్నూర్: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆడే శీల అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఏక కాలంలో రెండు లక్షల రుణ మాఫీకి క్యాబినెట్ ఆమోదం తెలపడం పట్ల నాయకులు ఆదివారం హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ మస్కే మాధవ, పార్టీ మండల అధ్యక్షుడు మాల్యాల కరుణాకర్, నాయకులు బుద్దె గోవింద్, సాసనే మాధవ్, అంకతి రవి, మారుతి, తదితరులు పాల్గొన్నారు.





● పిచ్చిమొక్కల మధ్య ఉన్న ఉట్నూర్‌లోని గృహ నిర్మాణ శాఖ డివిజన్ కార్యాలయం

నిర్మిత కేంద్రాలు.. నిరుపయోగమే!

- జిల్లాలో దశాబ్దం గడిచినా.. దశ మారని ఇందిరమ్మ ఇళ్లకు చెందిన నిర్మిత కేంద్రాలు
- ఇనుప సామగ్రి దొంగల పాలు
- తుప్పుపడుతున్న యంత్రాలు
- అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- జిల్లావ్యాప్తంగా ఇప్పటికీ అందుబాటులోకి రాని 'డబుల్' ఇళ్లు

ఉట్నూర్, జూన్ 23: ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన నిర్మిత కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. ప్రభుత్వ భూములలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం, కావాల్సిన వస్తువుల ఉత్పత్తి కోసం ఏర్పాటు చేసిన నిర్మిత కేంద్రాలు పనికి రాకుండా పోయా యి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో లక్షలాది ఇందిరమ్మ ఇళ్లు నిర్మించారు. పేదలకు కనీసనీడ కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్లు ఏ గ్రామంలో చూసినా దర్శనం ఇస్తున్నాయి. కోట్ల రూపాయల బడ్జెట్‌తో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదలకు సొంతగూడు కల సాకారం చేసింది.

అందుబాటులోకి రాని 'డబుల్' ఇళ్లు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయ్యాక దశాబ్ద కాలంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన డబుల్ బెడ్‌రూమ్ గృహాలు ఇప్పటికీ పేదలకు అందుబాటులోకి రాలేదు. మైదాన ప్రాంతాలలో అక్కడక్కడ నిర్మించిన డబ్బులు బెడ్‌రూమ్ గృహాలను లబ్ధిదారులకు ఇచ్చినప్పటికీ.. ఏజెన్సీ ప్రాంతాలలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ గృహాలు శిథిల దశకు చేరుకుంటున్న లబ్ధిదారులను గుర్తించడంలో ప్రభుత్వం విఫలమైంది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆరు నెలలు కావొస్తున్నా.. ఏజెన్సీ ప్రాంతంలోని డబుల్ బెడ్‌రూమ్ గృహాలు లబ్ధిదారులకు పంపిణీ చేయడం లేదు. ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల ప్రాంతాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం కావాల్సిన వస్తుసామగ్రి తయారు చేయడానికి ఏర్పాటు చేసిన నిర్మిత కేంద్రాలు అలంకారప్రాయంగా నిలిచిపోయాయి.

దొంగలపాలవుతున్న ఇనుము

దశాబ్దం కంటే ముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం నిర్మిత కేంద్రాల వద్ద కొనుగోలు చేసి పెట్టిన ఇనుము దొంగలపాలు అవుతుంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇవ్వడానికి కిటికీల ఫ్రేమ్‌లు, తలుపుల ఫ్రేమ్‌లు, సజ్జలు, పైకప్పు రేకులు, పైపులైన్ల పై కప్పులు తదితర వస్తువులు తయారు చేయడానికి అప్పుడున్న అధికారులు భారీ మొత్తంలో స్టీల్ (ఇనుము) కొనుగోలు చేయడంతో పాటు, ఇసుక కూడా గోదావరి నుంచి తెప్పించి కుప్పలుగా నిర్మిత కేంద్రాలలో పోయించారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయాక తెలంగాణలో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బ్రేకులు వేసింది. డబుల్ బెడ్ రూం గృహాల నిర్మాణానికి అంకురార్పన చేసింది. నిర్మిత కేంద్రాలలో తెచ్చిపెట్టిన స్టీలు, ఇసుక, సిమెంట్ గురించి పట్టించుకోక పోవడంతో పాటు నిర్మాణ శాఖలో పనిచేస్తున్న ఈఈలు, డిప్యూటీ ఈఈలు, ఏఈ లు, వర్క్ ఇన్స్‌పెక్టర్లను ఇతర ప్రభుత్వ శాఖలకు కేటాయించడంతో పాటు గృహ నిర్మాణ శాఖను నిర్వీర్యం చేశారు. ఉమ్మడి జిల్లాకేంద్రం ఆదిలాబాద్‌లో ఉన్న గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం కూడా కేవలం నలుగురు సిబ్బందితో జిల్లా అధికారి మాత్రమే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కళకళలాడిన జిల్లా గృహ నిర్మాణ శాఖ కార్యాల యం ప్రస్తుతం అంతంతమాత్రంగా ఉండిపోయింది. ఫలితంగా నిర్మిత కేంద్రాలలో ఉన్న స్టీలు, ఇసుక, సిమెంట్‌తో తయారు చేసిన పరికరాలు దొంగల పాలు అయ్యాయి.



ఉట్నూర్‌లో చెడిపోతున్న యంత్రాలు



తుప్పుపట్టిన ఇటుకల తయారీ యంత్రాలు



పొదల మధ్య తుప్పుపట్టిన స్టీల్

తుప్పుపడుతున్న పరికరాలు

గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉట్నూర్ నిర్మిత కేంద్రంలో అధికారులు వస్తువుల తయారీకి ఏర్పాటు చేసిన పరికరాలు తుప్పుపడుతున్నాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసి ఇటుకల తయారీ యంత్రాలు, ఇసుక సిమెంట్ మిక్సింగ్ యంత్రాలు, పట్టించుకునే వారు లేక ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పు పడుతున్నాయి. ఇదే కాకుండా భారీ మొత్తంలో అధికారులకు కొనుగోలు చేసి నిర్మిత కేంద్రం వద్ద స్టాక్ చేసిన స్టీలు దొంగలు దొంగలించుక పోగా.. ఉన్నది కూడా చెత్తకుప్పల మధ్య తుప్పుపడుతున్నా.. చూసేవారు లేకుండా పోయారు. ఫలితంగా ప్రజాధనం ఎంత వృథా అవుతున్నా.. మనకెందుకులే అని అధికారులు నిట్టురుస్తున్నారు. ఇప్పటికైనా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మిత కేంద్రాల పునరుద్ధరనకు చర్యలు చేపట్టి ప్రభుత్వం త్వరలో ప్రారంభించబోయే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డబుల్ బెడ్‌రూం గృహాల నిర్మాణం చూస్తున్నాం

: భసవేశ్వర్, పీడీ, గృహ నిర్మాణ శాఖ నోడల్ అధికారి ఆదిలాబాద్



గత ప్రభుత్వంలో అమలు చేసిన డబుల్‌బెడ్‌రూమ్ గృహాల నిర్మాణ పనులను చేయించాం. జిల్లా నోడల్ అధికారిగా తనకు ఉన్న స్వల్ప సిబ్బందితో కార్యాలయం పనులు సాగిస్తున్నాం. నిర్మిత కేంద్రాలను రెవెన్యూ అధికారులకు అప్పగించడం జరిగింది. గృహ నిర్మాణ శాఖలో ఉన్న సిబ్బంది అందరు డిప్యూటేషన్లపై వెళ్లారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వం ప్రారంభిస్తే సిబ్బందిని ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు.

లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకున్న జిల్లా న్యాయాధికారి

జైనథ్, జూన్ 23: మండల కేంద్రంలో అతిపురాతన ఆలయం అయిన శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయాన్ని ఆదివారం జిల్లా న్యాయాధికారి దర్శించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఆలయ అర్చకుడు డి.ధీరజ్‌ను ఆలయ చరిత్ర, విశిష్టతను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్ ఏనుగు సాయికరణ్‌తో పాటు గ్రామ ప్రజలు, తదితరులు ఉన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న న్యాయాధికారి దంపతులు

పోలీసు అధికారులకు సేవా పథకాలు

● అభినందించిన జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 23: పోలీసు శాఖలో చేసిన ఉన్నతమైన సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జూన్ 2 సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సేవా పథకాలను విడుదల చేసింది. జిల్లాకు చెందిన 20 మంది పోలీసు అధికారులకు సేవా పథకాలు లభించడం విశేషమని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. ఈ సందర్భంగా సేవ పథకాలను అందుకోనున్న పోలీసు అధికారులకు, సిబ్బంది జిల్లా ఎస్పీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. కాగా ఉత్తమ సేవ పథకంకు పి.యువరాజ్ ఏఆర్ఎస్సై 4087డీఏఆర్ ఆదిలాబాద్ ఎంపికయ్యారన్నారు. కాగా, సేవ పథకాలు పొందిన వారిలో జీవీ.రమణరెడ్డి, ఎస్సై ఆఫ్ పోలీసు బోథ్ పీఎస్ ఏటీటీ 2-టౌన్ పీఎస్ ఆదిలాబాద్, బి.శివరామ్ ఎస్సై ఆఫ్ పోలీసు తాంసి పీఎస్, ఎన్. ముకుంద్ రావు, ఏఎస్సై-678 ఉట్నూర్ పీఎస్, కె.రమేష్ ఏఎస్సై-1818 నేరడిగొండ పీఎస్, కె.భీంరావు ఏఎస్సై-1811 ఇంద్రవెల్లి పీఎస్, ఆర్.ఆత్మరాం ఏఎస్సై-1758, ఉమెన్ పీఎస్, ఆర్.బలిరామ్, ఏఎస్సై 1783 గుడిహత్నూర్ పీఎస్, ఆర్.గణపతి ఏఎస్సై-1657 భీంపూర్, వెంకటమ్మ, డబ్ల్యుఏఎస్సై-1107 వన్ టౌన్ పీఎస్, ఏటీటీ డీసీఆర్‌బీ ఆదిలాబాద్, ఎం.జయలక్ష్మి, డబ్ల్యుఏఎస్సై -1869 టూ టౌన్ పీఎస్ ఆదిలాబాద్, ఎన్.పోశెట్టి ఏఆర్ఎస్సై -4093, డీఏఆర్ ఆదిలాబాద్, బి.సురేష్ ఏఆర్ఎస్సై-4094 డీఏఆర్ ఆదిలాబాద్, ఎస్.లక్ష్మణ్ ఏఆర్ఎస్సై -4095 డీఏఆర్ ఆదిలాబాద్, కె.గణపతి హెచ్‌సీ-1886 తాంసి పీఎస్, వెంకట్‌రావు, హెచ్‌సీ-2137 జైనథ్ పీఎస్, ఎస్.రాజన్న, ఏఆర్‌హెచ్‌సీ -2425, డీఏఆర్ ఆదిలాబాద్, ఎండీ.జాఫర్ ఉద్దీర్ ఏఆర్ హెచ్‌సీ-2527 డీఏఆర్ ఆదిలాబాద్, షేక్ అమీర్ ఏఆర్‌హెచ్‌సీ -2488 డీఏఆర్ ఆదిలాబాద్, జె.దేవిదాస్ పీసీ -1720 ఇంద్రవెల్లి పీఎస్, బి.సురేష్ ఏఆర్ఎస్సై-4094 డీఏఆర్ ఆదిలాబాద్ ఉన్నారు.



దేవుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా భీమన్న దేవుడి పండుగ

తాంసి, జూన్ 23: ప్రతియేటా నిర్వహించే భీమన్న దేవుని పండుగను మండలకేంద్రంలో ఆదివారం ముదిరాజ్ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమన్న దేవునికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. పంటలు బాగా పండాలని, వర్షాలు సకాలంలో కురవాలని, గ్రామస్థులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యఉడు గుగ్గిళ్ళ పోచ్చన్న, మండల బీసీ యువజన విభాగం అధ్యక్షుడు దారవేణి రాఘవేంద్ర, సంఘ నాయకులు స్వామి, రమాకాంత్, సాయి, బంగారి, నవీన్, రాకేష్, శివాజీ, అశోక్, వెంకట్, తదితరులు ఉన్నారు.

బాలికల ఆత్మరక్షణ కోసం కరాటే

● రాష్ట్ర అధ్యక్షుడు సాయిని రవికుమార్

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 23: ప్రస్తుత కాలంలో మహిళలు, బాలికలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటేను నేర్చుకోవాలని షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిని రవి అన్నారు. పట్టణంలో ఆదివారం సాహా తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్టింగ్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరై సాయిని రవి పిల్లలకు బెల్టులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మహిళలు, బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. దాడులు పెరుగుతున్న నేపథ్యంలో మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండాలన్నారు. బెల్ట్ గ్రేడింగ్‌లో ప్రతిభచాటిన వారు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలు చేరుకోవా లని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నడిమెల హరిచరణ్, సాహా తైక్వాండో క్లబ్ మాస్టర్ వీరేష్, శృతి, మాధురి, రాథోడ్ వనిత, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఒలింపిక్ డే పరుగులో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

ఆదిలాబాద్ రూరల్, జూన్ 23: జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా సాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పాయల్ శంకర్ క్రీడా జ్యోతిని వెలిగించి పరుగులో పాల్గొన్నారు. ఈ పరుగు క్రమంభీం, ఎన్టీఆర్ చౌక్‌ల మీదుగా క్రీడా ప్రాంగణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, ఆటల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులను వెలికి తీసేందుకు ఈ ఒలింపిక్ డే నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, కన్వీనర్ కోరెడ్డి పార్థసారథి, ఆయా క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

● విద్యార్థులకు నాణ్యమైన క్రీడా శిక్షణ అందించాలి

ఆదిలాబాద్ రూరల్: క్రీడల్లో పునాది పాఠశాలల్లోనే జరుగుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జూడో హాలులో ఆదివారం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇటీవల పీఈటీల నుంచి పీడీలుగా ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులను నాణ్యమైన క్రీడా శిక్షణ ఇచ్చి వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పార్థసారథి, స్వామి, కోశాధికారి సాయికుమార్, ఆయా క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

● కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్ అర్బన్: పట్టణంలోని వార్డు నెంబర్9 అంబికనగర్ కాలనీలో ఎమ్మెల్యే పాయలశంకర్ ఆదివారం సందర్శించి కాలనీలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కాలనీలో తిరుగుతు పరిసర ప్రాంతాలను పరిశీలించగా కాలనీలో నెలకొన్న సమస్యల పై కాలనీ వాసులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని,కాలనీలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు.దీంతో సాను కూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారినికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో కౌన్సిలర్ రఘుపతి, శివ, రాష్ట్రపాల్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం



నీటిలో ఆయిల్‌బాల్స్ వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ఆదిలాబాద్ రూరల్, జూన్ 23: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బల్దియా తరపున అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని కమిషనర్ మహమ్మద్ ఖమర్ అహ్మద్ పేర్కొన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని సంజయ్‌నగర్, పోలీస్ కాలనీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేశారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంను కలిసిన నాయకులు

నేరడిగొండ, జూన్ 23: హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో మంత్రి సీతక్క, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తుమల్లేష్ ఆధ్వర్యంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా అటవీ భూముల సమస్య, కుప్టి ప్రాజెక్టు, ఇతర అంశాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. సీఎం సానుకూలంగా స్పందించి త్వరలో నియోజకవర్గంలోని సమస్యలన్నీ తీరుస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

పర్యాటక కేంద్రంపై పట్టింపు కరువాయే!

● పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారిన పొచ్చెర జలపాతం ● కనీస సౌకర్యాలు లేవంటూ పర్యాటకుల మండిపాటు



విరిగిన తలుపులతో దర్శనమిస్తున్న మూత్రశాలలు



పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ కుర్చీల దుస్థితి ఇలా..

బోథ్, జూన్ 23: చుట్టూ పచ్చని ప్రకృతి.. గలగల పారే సెలయేరు.. పైనుంచి జలజల పారుతూ దూకే నీటి ప్రవాహం.. చుట్టుపక్కల పక్షుల కిలకిల రావాలతో పర్యాటకులను మంత్ర ముగ్ధలను చేసే పొచ్చెర జలపాతం పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. జాతీయ రహదారికి 11 కిలో మీటర్ల దూరంలోని కుంటాల జలపాతం అభివృద్ధికి ఏటా నిధులు మంజూరు అవుతుంటే 44వ జాతీయ రహదారికి ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్న పొచ్చెర జలపాతం పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తుంది. సుదూర ప్రాంతాల నుంచి ఈ జలపాతాన్ని చూసేందుకు వచ్చిన వారికి కనీస సౌకర్యాలు లేక పాలకుల తీరుపై ప్రభుత్వ అధికారులపై పర్యాటకులు ఆగ్రహం వ్యక్త పరుస్తున్నారు. భారీ సంఖ్యలో జలపాతాన్ని చూసేందుకు వర్షాకాలం మహారాష్ట్రతో పాటు నిర్మల్, నిజామాబాద్ జిల్లాల నుంచి వచ్చిన పర్యాటకులకు కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. పర్యాటకులు కూర్చునేందుకు వేసిన సిమెంట్ దిమ్మెలు కుర్చీలు విరిగిపోయి ఉండగా, మూత్రశాలల తలుపులు విరిగిపోయి దర్శనమిస్తున్నాయి. అంతేగాక పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఉయ్యాలలు తుప్పుపట్టి అవసాన దశకు చేరుకున్నాయి. పర్యాటకుల వాహనాలకు ఎంట్రీ ఫీజులు తీసుకుని లోపలికి అనుమతి ఇచ్చిన తరువాత పర్యాటకులు మాత్రం ఎందుకు ఎంట్రీ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. కనీస సౌకర్యాలు లేక ఉన్న పర్యాటక కేంద్రాన్ని అధికారులు పట్టించుకోవాలని పర్యాటకులు అంటున్నారు. ప్రభుత్వ పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



● బోథ్ మండలంలో 44వ జాతీయ రహదారి నుంచి కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పొచ్చెర జలపాతం

ఆదివాసీ గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

● నేడు చలో ఐటీడీఏ : తుడుందెబ్బ జిల్లా నాయకుల పిలుపు

ఉట్నూర్, జూన్ 23: జిల్లాలోని ఆదివాసీ గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించనున్న చలో ఐటీడీఏ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ఆదివాసీ గిరిజనులు తరలివచ్చేలా తుడుందెబ్బ ప్రణాళికలు చేసింది. వర్షాకాలం ప్రారంభమై వర్షాలు పడుతున్న తరుణం వ్యవసాయ పనులు వదులుకొని కూడా పరిష్కారం కోస 9 తెగల ఆదివాసీ గిరిజనులు తరలి రావాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు పురకబాపురావు కోరారు. షెడ్యుల్ ప్రాంతంలో మెగా స్పెషల్ డీఎస్సీ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఐటీడీఏలో బ్యాగ్‌లాక్ పోస్టులను భర్తీ చేయాలని, జీవో3ను యధావిధంగా కొనసాగించాలని, అలాగే ఉద్యోగస్థులకు పదోన్నతులు, బదిలీలు కల్పించాలని, ఉమ్మడిజిల్లాలో పోడు భూములు సాగు చేస్తున్న పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని, పోడు భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ముందు తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని ఆదివాసీ 9తెగల నాయకులు, ప్రజలు ఉద్యోగస్థులు, ఆదివాసీ సంఘాల నాయకులు, విద్యార్థులు, నిరుద్యోగ యువతీ, యువకులు, ఉపాధ్యాయ, కార్మిక కర్షక మేధావులు, కవులు, కళాకారులు ప్రతీఒక్కరు ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



తలమడుగులో మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

● ఎస్పీ ఆదేశాల మేరకు బందోబస్తు

: నాగేందర్, డీఎస్పీ, ఉట్నూర్



జిల్లాలోని గిరిజనులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ధర్నా శాంతి యుతంగా నిర్వహించుకోవాలని,ఈ మేరకు జిల్లా పోలీసు అధికారి ఆదేశాల మేరకు ఎలాంటి అలజడులు చోటు చేసుకోకుండా బందోబస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గిరిజనులు శాంతియుతంగా తమ సమస్యల వినతి పత్రాన్ని పీఓకు సమర్పించుకోవాలన్నారు.

● 'ధర్నాను విజయవంతం చేయండి'

తలమడుగు: ప్రభుత్వాలు మారిన ఆదివాసీ గిరిజన బతుకులు మారడం లేదని, అంతేకాకుండా ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర తుడుందెబ్బ కమిటీ పిలుపు మేరకు ఈనెల 24న ఉట్నూర్, ఐటీడీఏ కార్యాలయం ముందు చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు జంగాల పోచన్న, ఆదిలాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కుంర జ్ఞానేశ్వర్‌లు కోరారు. ఆదివారం వారు మండలకేం ద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ధర్నాలు, ఆదివాసులందరూ పాల్గొని విజయవతం చేయాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం వెంటనే స్పందించి షెడ్యూల్ ప్రాంతంలో మెగా స్పెషల్ డిఎస్సీ ఏర్పాటు చేయాలి, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఐటీడీఏలో బ్యాగ్‌లాక్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. జీవో ఎంఎస్ నెం.3ను యధావిధంగా కొనసాగించాలి. జీవో ఎంఎస్ నెం.3 ప్రకారం ఉద్యోగస్తులకు పదోన్నతులు బదిలీలు కల్పించాలి. పోడు భూములు సాగు చేస్తున్న పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఆదివాసీ 9తెగల నాయకులు ప్రజలు ఉద్యోగస్తులు సంఘాల నాయకులు విద్యార్థులు నిరుద్యోగ యువత, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, మేధావులు, కవులు, కళాకారులు ప్రతీఒక్కరు మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల తుడుందెబ్బతో పాటు అనుబంధ, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఇందులో మండల గౌరవ అధ్యక్షుడు గోడం భుజంగరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడ ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి దావరి పోచన్న, సహాయ కార్యదర్శి నీలగిరి, అశోక్, కోశాధికారి మండల నాయకులు, మాజీ ఎంపీపీ సిదం రాము, మెస్రం విలాష్, జుగ్నాక్ సుభాష్, కుమ్ర శంకర్, రమేష్, నామ్‌దేవ్, కృష్ణ, గ్రామ పటేల్‌లు, తదితరులు పాల్గొన్నారు.